సీహెచ్‌సీ ప్రారంభమెప్పుడో?



ప్రారంభానికి ఎదురు చూస్తున్న సీహెచ్‌సీ భవనం

- శిథిలమైన పాత భవనం
- అయినా..అందులే ప్రస్తుతం ఆస్పత్రి నిర్వహణ

పొందూరు: పొందూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నూతన భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 4.65 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసి సీహెచ్‌సీకి నూతన భవనాలను నిర్మించింది. అయితే ప్రస్తుత కూటమి సర్కార్ దీని ప్రారంభంపై దృష్టిసారించలేదు.



శిథిలావస్థలో ఉన్న పాతభవనం

శిథిలావస్థలో 30 పడకల ఆస్పత్రి

ప్రస్తుతం ఉన్న 30 పడకల సీహెచ్‌సీ శిథిలావస్థకు చేరింది. దాదాపు అన్ని గదుల్లోను పెచ్చులూడాయి. చిన్నపాటి వర్షానికి కారిపోతున్నాయి. గోడలు, పైకప్పులు పెచ్చులూడాయి. బీమ్‌లు పెచ్చులూడి ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. నూతన ఆస్పత్రి భవనానికి నాలుగు నెలల క్రితం అవసరమైన బెడ్లు, పలు పరికరరాలు వచ్చాయి. అయితే వాటిని పాత ఆస్పత్రి భవనంలోనే విడిచిపెట్టారు. దీంతో గదులు ఇరుకుగా మారాయి. దానికి తోడు వాటిపై వర్షపు నీరు కారుతుంది. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనంలోకి ఆస్పత్రిని మార్పు చేయాలని రోగులు కోరుతున్నారు.

నూతన భవనాన్ని అప్పగించలేదు



పొందూరు సీహెచ్‌సీ నూతన భవనాన్ని ఇంకా తమకు అప్పగించలేదు. భవనాన్ని అప్పగించాలని ఉన్నతాధికారులను కోరాం. ఎక్స్‌రే మిషన్ మంజూరైంది. త్వరలోనే నూతన భవనాన్ని అధికారులు ప్రారంభించనున్నారు.

– పేడాడ సుజాత, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి

గణనాథా కాపాడయ్యా..



సారవకోట కరణం వీధిలో లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

గణపతి నవరాత్రులు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో భక్తులు గణనాథునికి వివిధ పూజలు చేసి చల్లగా కాపాడాలని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం పలు గ్రామాల్లోని మండపాల్లో లలితా సహస్ర నామ పారాయణ పూజలు జరిగాయి. అలాగే కొన్నిచోట్ల భక్తులకు అన్నదానాలు చేయగా.. మరికొన్నిచోట్ల ఇప్పటి వరకూ పూజలందుకున్న పార్వతీ తనయుడు.. గణపతి విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సందడి వాతావరణం నెలకుంది.



కొత్తూరు: మెట్టూరు ఆర్‌ఆర్ కాలనీలో (పాడలి)లో భక్తుల పూజలు



బూర్జ: బూర్జ గ్రామంలో రెల్లివీధిలో అన్న సమారాధన



మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురంలో వినాయక నిమజ్జనం



ఆమదాలవలస: మెట్టక్కివలసలో విష్ణుసహస్ర నామ స్తోత్రపారాయణం చేస్తున్న మహిళలు



ఎల్.ఎన్.పేట: చిట్టిమండలంలో అన్నసంతర్పణ చేస్తున్న కమిటీ సభ్యులు



పాతపట్నం మెయిన్‌రోడ్డులో సందడి వాతావరణంలో నిమజ్జనానికి తరలుతున్న బొజ్జగణపయ్య

లబ్ధిదారుల వివరాల సేకరణ



లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న దృశ్యం

హిరమండలం: ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద 2014–19 ఆర్థిక సంవత్సరంలో ఇళ్లు మంజూరై పాక్షికంగా బిల్లులు చెల్లించబడిన లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నట్లు గృహనిర్మాణశాఖ ఇంజినీర్ కె.మాధవరావు తెలిపారు. సుబలయ గ్రామంలో శనివారం పర్యటించి లబ్ధిదారుల వివరాలను జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పర్యటించి అప్పట్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. గృహనిర్మాణ స్థితి, ఇప్పటివరకు మంజూరైన బిల్లులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వివరాలను సేకరించి నివేదికనుఅధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ పవన్‌కుమార్ ఉన్నారు.

రాజీయే రాజమార్గం



పొందూరు: లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి, న్యాయవాదులు



నరసన్నపేట: లోకఅదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి హరిప్రియ

- లోక్ అదాలత్‌లో వందలాది కేసులు పరిష్కారం

నరసన్నపేట: రాజీయే రాజమార్గమని పలువురు జడ్జిలు అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వందలాది కేసులు పరిష్కారమయ్యాయి. నరసన్నపేటలో సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి సీహెచ్ హరిప్రియ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 27 క్రిమినల్ కేసులతో పాటు పలు కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి హరిప్రియ మాట్లాడుతూ.. కక్షిదారుల మేలు కోసం జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని.. వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు జామి కామేశ్వరరావు, గణేష్ నాయుడు, రోణంకి కృష్ణారావు, గొండు సత్యన్నారాయణ, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణరావు, న్యాయవాదులు తూలుగు మధు, పారా లీగల్ వలంటీర్లు కె.ఎన్.స్వామి, పండిట్ వెంకటేశ్వరరావు, కలిశెట్టి సత్యంమూర్తి పాల్గొన్నారు.

కొత్తూరులో 119 కేసులు..

కొత్తూరు: లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని కొత్తూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి అన్నారు. స్థానిక కోర్టులో లోక్ అదాలత్ ఆన్‌లైన్ ద్వార నిర్వహించారు. ఈ సందర్భంగా 119 కేసులను పరిష్కరించారు. పలు కేసుల్లో రూ. 1,11,200 అపరాధ రుసుం వసూలు చేసినట్టు చెప్పారు. కొత్తూరు, బత్తిలి, హిరమండం పోలీస్ స్టేషన్ల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఫోటో14పీటీఎం61–280043 కొత్తూరు: లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులు

పొందూరులో 104 కేసులు..

పొందూరు:స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి బి.జ్యోత్స్న అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్‌లో 104 కేసులను పరిష్కరించారు. సీనియర్ న్యాయవాదులు కె.రమణమూర్తి, బ్రహ్మాజీ, రామ్మోహన్, సురేష్ పాల్గొన్నారు.

పాతపట్నంలో 150..

పాతపట్నం: పాతపట్నంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అదాలత్ 150 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి చెప్పారు. వీటిలో డ్రంక్ అండ్ అండ్ డ్రైవ్ కేసులు 136, రాజీపడదగిన క్రిమినల్ కేసులు తొమ్మిది, ఎంసీ కేసు రెండు, పార్టీ షూట్ కేసు రెండు, ఎస్.ఎ.కేసు ఒకటి ఉన్నాయి. అలాగే కక్షిదారుల నుంచి అపరాధ రుసుంగా రూ. 8,69,875 వసూలు అయిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఇ.సత్యనారాయణ, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లు, న్యాయవాదులు, పాతపట్నం ఎస్ఐ లావణ్య, సారవకోట పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలసలో 135..

ఆమదాలవలస: ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జికోర్టులో జడ్జి ఎస్.మణి ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 135 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే పలు కేసుల్లో 45,450 రూపాయలను అపరాధ రుసుంగా వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించినట్లు జడ్జి మణి తెలిపారు. తొలుత కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సభ్యులు ధనుంజయరావు, కింతలి త్రినాథరావు, న్యాయవాదుల తమ్మినేని అన్నంనాయుడు పాల్గొన్నారు.



పాతపట్నం: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రోషిణి



ఆమదాలవలస: అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి

పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన బాట

- విధులకు దూరంగా డాక్టర్లు



హిరమండలం పీహెచ్‌సీ ఆవరణలో నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు

నరసన్నపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న 85 జీవో రద్దుతో పాటు ఇతర సమస్యలు పరిష్కారానికి పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు ఆందోళన బాటపట్టారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం వైద్యులు అత్యవసర సేవలు మినహా సాధారణ సేవలకు హాజరు కాలేదు. ఉర్లాంలో డాక్టర్ అరవిందు, మాకివలసలో డాక్టర్లు శిరీష, విజయకుమార్ ఆందోళనలో పాల్గొన్నారు. అత్యవసర సేవలకు ఇబ్బంది కలగలేదు. వచ్చిన రోగులకు పీహెచ్‌సీ సిబ్బందే చూసి పంపారు. ఉర్లాం డాక్టర్ అరవిందు మాట్లాడుతూ.. 85 జీఓ వలన తమకు నష్టం జరుగుతోందన్నారు. ఇన్ సర్వీసు కోటాలో పీజీకి అవకాశం తగ్గుతుందని చెప్పారు. దీంతో తమలాంటి డాక్టర్లకు పీజీలు చేసే అవకాశాలు సన్నగిల్లుతాయని అన్నారు. మాకివలస వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ.. ఈ జీఓ రద్దు చేయాలని, ప్రాథమిక వైద్య కేంద్రాల్లో పనిచేసిన వైద్యులకు ఇన్‌సర్వీసు కోటా కింద పీజీకి అవకాశాలు పెంచాలన్నారు.

సారవకోట: సారవకోట, బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు విధులకు హాజరు కాలేదు. మూడు రోజుల పాటు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించగా శనివారం పూర్తిగా విధులకు హాజరు కాలేదు. అత్యవసర సమయంలో మాత్రమే విధులకు హాజరు అవుతామని మండలంలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు తెలిపారు.

పాతపట్నం: ఇన్ సర్వీస్ కోటాను తగ్గించి ప్రభుత్వం అనాలోచితంగా ఇచ్చిన జీవో 85 వెంటనే రద్దు చేయాలని గంగువాడ పీహెచ్‌సీ వైద్యులు ఎస్ శివ కుమార్, పూర్ణిమలు డిమాండ్ చేశారు. బ్లాక్ రిబ్బన్‌లు పెట్టుకొని వైద్యులు నిరసన తెలుపుతూ, ఓపీ నిలిపివేశారు.



చాపర పీహెచ్‌సీలో రోగులకు వైద్యం చేస్తున్న స్టాఫ్‌నర్స్

మెళియాపుట్టి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓపీ సేవలను నిలిపి వేస్తున్నట్లు చాపర, మెళియాపుట్టి వైద్యులు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చిన రోగులకు ఏఎన్ఎంలు వైద్యసేవలు అందించారు. జ్వర పీడితులు ఇబ్బంది పడ్డారు.

ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం



నిరసనలు తెలియజేస్తూనే ఇన్నాళ్లు విధులు నిర్వర్తించాం. జీవో 85 రద్దు చేయకపోవడంతో పాటుగా నీట్ పీజీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఇంకా ఇలాగే విధుల్లో కొనసాగలేం. అందుకే ఓపీ నిలిపివేశాం. వృద్ధులు అనారోగ్య సమస్యలతో వస్తుంటే బాధగా ఉంది. కానీ యూనియన్ పిలుపును ధిక్కరించలేం. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరసనలు తప్పవు. 16వతేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేస్తాం. –డాక్టర్ పావని, చాపర పీహెచ్‌సీ

కొత్తూరు: కురిగాం, మెట్టూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న నలుగురు వైద్యాధికారులు విధులను బహిష్కరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

హిరమండలం: జీవో నంబర్ 85కు వ్యతిరేకంగా హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీలో అత్యవసర వైద్యసేవలు మినహా ఓపి సేవలు నిలుపవేసినట్లు ఆయా వైద్యాధికారులు సీహెచ్ సాయిగీత, యశ్వంత్‌లు తెలిపారు.పీహెచ్‌సీ ఆవరణలో శనివారం నిరసన తెలియజేశారు.



సారవకోట పీహెచ్‌సీలో వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



పాతపట్నం: గంగువాడ పీహెచ్‌సీలో ఓపీ నిలివేసిన వైద్యులు శివకుమార్, పూర్ణిమ

జాతీయ సమైక్యతకు హిందీ దోహదం



హిందీ దివస్‌లో ఉపాధ్యాయులు

జలుమూరు: జాతీయ సమైక్యతకు హిందీ భాష దోహదం చేస్తుందని లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ అన్నారు. హిందీ దివస్ పురస్కరించుకొని శనివారం పాఠశాలలో విద్యార్థులకు హిందీ భాషపై డిబేటింగ్, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కబీర్‌దాస్ జయంతిని జాతీయ హిందీ దినోత్సవంగా జరుపుకోవడం సంప్రదాయమన్నారు. ఉపాధ్యాయులు జల్లు రమణ మూర్తి, చిట్టెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..



స్వర్ణ పతకాన్ని అందుకుంటున్న దుర్గాప్రసాద్

దుర్గాప్రసాద్‌కు స్వర్ణ పతకం

పొందూరు: మలకాం గ్రామానికి చెందిన దోభాకుల దుర్గాప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. అసోం యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో స్వర్ణ పతకం వరించింది. ఈయన 2021–23 ఏడాదిలో ఎంఎల్ఐసీ పూర్తి చేసి వర్సిటీ టాపర్‌గా నిలిచారు. దీంతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మోహన్‌పంత్ చేతులు మీదుగా స్వర్ణ పతకాన్ని శనివారం అందుకున్నారు. దుర్గాప్రసాద్‌కు స్వర్ణ పతకం రావడంతో వర్సిటీ సహాయ ఆచార్యులు బాసా మురళీ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రూ. 30 వేలు పలికిన వినాయక లడ్డూ



లడ్డూతో చిన్నారావు, శ్రీదేవి దంపతులు

నరసన్నపేట: తామరాపల్లి గ్రామంలోని వినాయక మండపంలో ప్రసాదంగా ఉంచిన లడ్డూను శనివారం రాత్రి వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన తట్ట చిన్నారావు, శ్రీదేవి దంపతులు 30,500 రూపాయలకు దక్కించుకున్నారు. కమిటీ ప్రతినిధులు కోల అప్పారావు, సుంకరి రమణ, లావేటి నేతాజీ పాల్గొన్నారు.

సెలవని తెలిసి..

నరసన్నపేట: మార్కెట్ కమిటీ ప్రహరీకి ఆనుకుని గొట్టిపల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 172 లో అక్రమ నిర్మాణం జరుగుతోంది. దీన్ని గతంలో అధికారులు అడ్డుకున్నారు. అయితే ఇప్పుడు వరుస సెలవులు కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని భావించి ఆక్రమణదారు పనులు వేగవంతం చేశారు. రూ.రెండు కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలానికి సంబంధించి రూ.లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు సమాచారం. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఈ స్థలంలో ఒక్క సారి నిర్మాణ పనులు చేస్తుండటంతో రెవెన్యూ అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న స్థలం కూడా మరో వైపు ఆక్రమణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్మాణంపై తహసీల్దార్ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సర్వేయరు, వీఆర్వోలకు పంపి పనులు ఆపించామని, రికార్డులు పరిశీలించిన వరకూ పనులు చేపట్టవద్దని సూచించినట్లు తెలిపారు.



మార్కెట్ కమిటీ ప్రహరీకి ఆనుకొని జరుగుతున్న అక్రమ నిర్మాణం

క్లుప్తంగా

నవోదయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పరశురామయ్య

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య అన్నారు. విద్యాలయంలో పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. గతేడాది విద్యాయంలో 10, 11 తరగతులు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. దీనికి సంబంధించి విద్యాలయానికి గృహకల్ప అవార్డు అందుకున్నామని తెలియజేశారు. సీబీఎస్ఈ ఫలితాల్లో మంచి మార్కులు సాధించే దిశగా కృషి చేసిన అధ్యాపకులకు ప్రసంశాపత్రాలు అందించారు.

డిసెంబర్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

నరసన్నపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకూ కాకినాడలో నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా నరసన్నపేటలోని ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల మానసిక ఉల్లాసానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. సంఘ ప్రతినిధులు బమ్మిడి శ్రీరామమూర్తి, వైకుంఠరావు, సుధీర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆలయానికి వెండి పంచామృత సెట్లు వితరణ



వెండి సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన శాసనపూరి మహేశ్వరరావు 600 గ్రాముల వెండి పంచామృత సెట్లను వితరణ చేశారు. దేవదాయశాఖ ఉద్యోగి కె.సుదర్శనరావు, పూజారి శ్రీనివాసా ఆచార్యులకు వీటిని శనివారం అందజేశారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న రవీంద్రబాబు, మల్లేశ్వరరావు

ఎల్.ఎన్.పేట: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భగవాన్ సత్యసాయి గ్రామ సేవలు జిల్లా ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, కె.మల్లేశ్వరరావు అన్నారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి మందిరంలో శనివారం సత్యసాయి భక్తులతో జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో వీరు మాట్లాడారు. సత్యసాయి ఆశయాలను, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత భక్తులపై ఉందన్నారు. త్వరలో జరిగే పర్తియాత్రకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు, ఎల్.శైలజ, దుర్గారావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీనరసింహా స్వామి కోలాట బృందం ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు కృష్ణామాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం చేయించారు. లక్ష్మీనరసింహా కోలాట బృందం ప్రతినిధులు సంతోషి, సుధాకర్ పాల్గొన్నారు.

ఏచూరికి ఘనంగా నివాళి

కొత్తూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆ పార్టీ నాయకులు నిమ్మక అప్పన్న అన్నారు. గొట్టిపల్లి గిరిజన గ్రామంలో ఏచూరి సంతాప సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు ఆరిక గణపతి, రామారావు, నిమ్మక శివ, రాజు, గోపయ్య పాల్గొన్నారు.